క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం
కాగజ్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబును బుధవారం పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు సన్మానించారు. ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్‌లోని చర్చి వ్యవస్థాపకులు ఫాదర్ చావరా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫాదర్ చావరా గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ
ఆసిఫాబాద్‌అర్బన్: అయోధ్యలోని శ్రీరామ మందిర అక్షింతలను బుధవారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ సంకీర్తన, భజనా కార్యక్రమాలను చేపట్టారు. ఈనెల 15వ తేదీ వరకు ప్రతి ఇంటింటికి అక్షింతలను, రామమందిర చిత్రపటాలను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో రామమందిరాన్ని ప్రారంభిస్తున్నందున భక్తులు పెద్ద సంఖ్యలో అయోధ్యకు తరలి వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వేణుగోపాల్, శ్రీరాములు, జంజిరాల శ్రీనివాస్, కల్లూరి సంతోష్, శ్రీకాంత్, సురేష్, తిరుపతి, మారుతి, భక్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

రామయ్య (ఫైల్)

రెబ్బెన: అనారోగ్యంతో మండలంలోని తక్కళపల్లి మాజీ సర్పంచ్ టేకం రామయ్య (78) బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కొంత కాలంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రామయ్యను కొద్దిరోజుల క్రితం కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. వట్టివాగు ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఆదివాసీలకు పూర్తి స్థాయిలో పరిహారం అందేలా నిరంతరం పోరాటం చేసి అనేక మంది లబ్ధిదారులకు పరిహారం అందేలా రామయ్య కృషి చేశారు.

నేడు అవగాహన సదస్సు
కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని దరిగాం, రేగులగూడ గ్రామాల్లో గురువారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు సీఎస్సీ వీఎల్ఈ చిరంజీవి తెలిపారు. పీఎం జన్‌మన్ ప్రాజెక్టులో భాగంగా ఆయుష్మాన్ భారత్, పీఎం ఈకెవైసీ, ఆధార్ అప్‌డేట్, పీఎం విశ్వకర్మ, తదితర పథకాలపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ
కాగజ్‌నగర్‌రూరల్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ వ్యవస్థాపకులు, దివంగత స్వామిరెడ్డి వర్ధంతి సందర్భంగా మండలంలోని ఈజ్‌గాం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీయుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి వనిత, లక్ష్మయ్య, కిరణ్ బేబి, స్వర్ణలత, మంజుభార్గవి, డిప్యూటీ డిఎంహెచ్ఓ సీతారాం, వైద్యులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ
బెజ్జూర్: ఇంటి గోడ కూలి మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన ఎగ్గ విమల, సత్తన్నలు గాయాలపాలయ్యారు. విముల నడుముకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బెజ్జూర్ ఆస్పత్రి నుంచి ఎక్స్‌రే నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. కాగా బాధితులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీ వర్ధన్, కార్యకర్తలు పరమర్శించారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
దహెగాం: మండలంలో గురువారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కవిత తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు హాజరై చెక్కులను అందజేస్తారని పేర్కొన్నారు. కొంచవెల్లి గ్రామంలో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో సైతం ఎమ్మెల్యే పాల్గొంటారని తహసీల్దార్ వివరించారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పూజల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం రాత్రి అయ్యప్ప పడి పూజ ఘనంగా నిర్వహించారు. గూడెం అయ్యప్ప ఆలయ పూజారి పురుషోత్తమచారి స్వామివారికి పడి పూజ నిర్వహించారు. కోవ సోనేరావ్, కోవ లక్ష్మి దంపతులతోపాటు ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ దంపతులు, నాయకులు సరస్వతి, సాయినాథ్, అరుణ పూజల్లో పాల్గొన్నారు.

డిజిటల్ బోధనకు శ్రీకారం

- ఉన్నత పాఠశాలల్లో ప్యానల్ బోర్డులు
- ఆసక్తిగా పాఠాలు వింటున్న విద్యార్థులు
- చాలా చోట్ల అమర్చని వైనం


ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

కెరమెరి: విన్న పాఠాలు కంటే.. మాధ్యమం ద్వారా చూసిన పాఠాలు గుర్తుండి పోతాయి. ఇదే విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం గత విద్యా సంవత్సరం నుంచి స్మార్ట్ బోధనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఏజెన్సీలోని కెరమెరి, జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యు) మండలాల్లోని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలోని ఇన్‌ట్రాక్టివ్ ప్యానల్ సిస్టం (ఐపీఎస్) బోర్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయగా మరికొన్ని పాఠశాలల్లో బిగించాల్సి ఉంది.

ఏజెన్సీ మండలాల్లో..
కెరమెరి మండలంలోని గోయగాం, కెరమెరి, ఝరి(ఉర్దూ మీడియం), కేజీబీవీలకు మొత్తం 15 ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఇక్కడ 850మంది విద్యార్థులకు ఉపయోగపడనుంది. సిర్పూర్ (యు)లోని ఉన్నత పాఠశాలతో పాటు మోడల్ స్కూల్, కేజీబీవీలకు 10 ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేయగా 800 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. జైనూర్ మండలంలోని జైనూర్ ఉన్నత పాఠశాలలతో పాటు పొచంలొద్ది కేజీబీవీలో 9ప్యానెల్లు మంజూరు కాగా 700 మంది విద్యార్థులు వీక్షిస్తున్నారు. లింగాపూర్‌లో ఉన్నత పాఠశాలతో పాటు కెజీబీవీకి 9ప్యానళ్లు మంజూరు కాగా 600మంది విద్యార్థులకు వినియోగంలోకి వస్తుంది. దీంతో ఆయా విద్యాలయాల్లో ఉన్న విద్యార్థులకు స్మార్ట్ (డిజిటల్) బోధన అమల్లోకి వచ్చింది.

బహుళ ప్రయోజనాలు..!
పాఠశాలకు మంజూరైన ఇన్‌ట్రాక్టివ్ ప్యానల్ బోర్డులు ప్రత్యేకంగా ఉంటాయి. ఇక ఫ్రేమ్ ఏర్పాటు చేసి అందులో 75 అంగుళాల స్మార్ట్ టీవీ ఉంటుంది. ఇరుపక్కల గ్రీన్‌చాక్ బోర్డులను ఏర్పాటు చేశారు. డిజిటల్ పాఠం అవసరమైనప్పుడు దాని ద్వారా చూపించవచ్చు. అవసరమైతే స్మార్ట్ ఫోన్ మాదిరిగా ఉపయోగించవచ్చు. అవసరమైన రంగుల్లోకి మార్చవచ్చు. లేదంటే మూసి ఉంచి చాక్ పీస్‌తో సాధారణ బోర్డుగా పాఠాలు బోధించవచ్చు. బోర్డుతో పాటు బ్యాకప్ బ్యాటరీ, అంతర్జాల కనెక్షన్ అందిస్తారు. అయితే మంజూరై నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ చాలా చోట్ల ఏర్పాటు చేయకపోవడం గమనార్హం!


బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పాఠాలపై ఆసక్తి

స్మార్ట్ టీవీల్లో పాఠాలు బోధించడం, రంగురంగుల చిత్రాలు చూడడం వల్ల చాలా ఆసక్తి కలుగుతుంది. దీంతో పాఠాలపై ఉత్సాహం పెరుగుతుంది. ఈ ఇన్‌ట్రాక్టివ్ ప్యానెల్ బోర్డులతో బహుళ ప్రయోజనాలు ఉండడంతో భవిష్యత్‌లో డిజిటల్ పాఠాలపై మక్కువ పెరుగుతుంది.

– నాగోషే అనూష, 8వ తరగతి, గోయగాం

కొన్నిచోట్ల ఏర్పాటు చేయాలి

స్మార్ట్ టీవీల బోధనతో విద్యార్థుల్లో పఠానాసక్తిని పెంచుతుంది. ఏజెన్సీలోని నాలుగు మండలాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు, కెజీబీవీ, సిర్పూర్ (యు)లోని మోడల్ పాఠశాలలకు స్మార్ట్ టీవీలు మంజూరయ్యాయి. కొన్ని చోట్ల అమర్చాల్సి ఉంది.

– కుడ్మెత సుధాకర్, ఎంఈవో, కెరమెరి

లింగాపూర్ జాతర కరపత్రాలు ఆవిష్కరణ

ఆవిష్కరిస్తున్న జాతర కమిటీ సభ్యులు

లింగాపూర్: మండల కేంద్రంలోని శ్రీజగదాంబదేవి జాతరను జయప్రదం చేయాలని లింగాపూర్ గ్రామ నాయక్ రాథోడ్ కిరణ్ నాయక్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో జగదాంబదేవి జాతరకు సంబంధించిన కరపత్రాలను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 25 వరకు ఈ జాతర నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతరలో క్రికెట్, కుస్తీ, వాలీబాల్, త్రాడు ఆట పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, వ్యాపారస్తులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాదవ్ గణపతి, జాదవ్ రమేష్, రాథోడ్ కిరణ్ నాయక్, జాదవ్ రామారావ్, జాటోత్ రాహుల్, ఆడే అశ్విన్, మంగులాల్, ఎమిల్, జాటోత్ నాందేవ్ ఉన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు గొగర్ల తిరుపతి అన్నారు. బుధవారం కౌటాల మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. దేశంలో కార్మిక రంగంపై ఫాసిస్ట్ దాడితో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను కుదించి కార్మికులకు తీరని ద్రోహం చేస్తున్నాయని తెలిపారు. ఈ నెల 11న రాష్ట్ర ద్వితీయ మహాసభలను వరంగల్‌లోని కార్మిక సంస్థ ఫంక్షన్ హాల్ శివనగర్‌లో ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

నవేగాం సర్పంచ్‌కి సావిత్రీబాయిపూలే అవార్డు

అవార్డు అందిస్తున్న బీసీ జాగృతి నాయకులు

రెబ్బెన: మండలంలోని నవేగాం సర్పంచ్ వడాయి మాధవికి తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే అవార్డును అందచేశారు. బుధవారం మంచిర్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాధవిని శాలువాతో సన్మానించి అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా బీసీ జాగృతి నాయకులు మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన మహిళలు రాజకీయంగా మరింత ఎదగాలని అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని 11, 24 వార్డుల్లో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెద్దవాగు పంపుహౌజ్ నుంచి సురక్షితమైన మంచినీటిని ఈ నెలలోనే సరఫరాను ప్రారంభిస్తామన్నారు. ఇంటెక్‌వెల్ పైపులైను పనులు 95శాతం పూర్తి అయిందన్నారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయి నివేదికలు అందించాలని కమిషనర్ అంజయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బోథ్ మాజీ ఎమ్మెల్యే
సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును బుధవారం బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న బోథ్ మాజీ ఎమ్మెల్యే

చెక్కుల పంపిణీ..
కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 76మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, నాయకులు అశోక్, తిరుపతి పాల్గొన్నారు.

బస్సు కోసం విద్యార్థుల ఎదురుచూపులు

రోడ్డుపై బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రం సమీపంలోనిని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆసిఫాబాద్, బూర్గుడ జాతీయ రహదారిపై ఉన్నందున వచ్చే బస్సులు పూర్తిగా నిండి వస్తున్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల విడుదల సమయంలో విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక బస్సు, బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రతి రోజు వివిధ గ్రామాల నుంచి 600 మంది విద్యార్థులు బస్సులోనే రాక పోకలు చేస్తున్నారు. బస్సులు పూర్తిగా నిండి రావడంతో 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉండాల్సి వస్తుందని విద్యార్థులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: మండలంలోని ఏటిగూడ గ్రామానికి చెందిన ఎర్నాగి లక్ష్మక్క మంగళవారం రాత్రి మృతిచెందారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు బుధవారం బీజేపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందజేశారు. మృతురాలి కుమారుడికి దివ్యాంగుల పింఛన్ మంజూరుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నాయకులు సామల తిరుపతి, అన్నారం తిరుపతి, ఆదె అశోక్, తొర్రెం జలపతి, తిరుపతి ఇప్పకాయల శంకర్, తలండి రాములు, గుండయ్య, రామయ్య, వెంకటి, పోచయ్య తదితరులు ఉన్నారు.

'ప్రజాపాలన'కు స్పందన

తుంగెడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారి

రెబ్బెన: మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. బుధవారం మండలంలోని పాశిగాం, లక్ష్మీపూర్, తుంగెడ, మాద్వాయిగూడ గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించి ప్రజల నుంచి దరకాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ సమీర్, సర్పంచులు శ్రీనివాస్, శ్యాంరావ్, పెంటయ్య, ఎంపీవో అంజద్‌పాషా ఉన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్, బాలాజీ అనుకోడ, కోర్సిని గ్రామాల్లో అధికారులు పర్యటించి ప్రజాపాలన సందేశాన్ని తెలియజేశారు. తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. బుధవారం వరకు మండల వ్యాప్తంగా 5338 ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ
దహెగాం: మండలంలోని అత్తిని, ఖర్జి, పిపిరావు కాలనీ, దిగిడ గ్రామాల్లో ఎంపీడీవో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

కౌటాల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. షెడ్యూల్‌లో భాగంగా ఐదు రోజు కౌటాల తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి తాటినగర్, కౌటాల గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ వీర్దండి, భాలేపల్లి గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మండల వాప్తంగా ఇప్పటి వరకు 8137 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో పాలకులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయిపూలే జయంతి

కౌటాల: సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న స్వేరో సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్/జైనూర్/కెరమెరి/ రెబ్బెన/ కౌటాల/ దహెగాం: చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలోబుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ మాట్లాడారు. అణగారిన వర్గాల నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన తత్వం సావిత్రీబాయిదని కొనియాడారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ మాట్లాడుతూ భర్త అడుగుజాడల్లో నడిచి విద్యావంతురాలిగా ఎదగిన సావిత్రీబాయి నేటి మహిళాలోకానికి స్పూర్తిదాయకమన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టీకానంద్ మాట్లాడుతూ అవమానాలను మెట్లుగా చేసుకొని ఉన్నత శిఖరమంత ఖ్యాతిని గడించి చదువుల తల్లిగా పేరు పొందిందని, కులం, మతం తేడా లేకుండా మహిళా అభ్యున్నతికి పాటుపడిందని గుర్తు చేశారు.

పాఠ్య పుస్తకాల్లో పొందుపర్చాలి
బెజ్జూర్: సామాజికవర్గ అభ్యున్నతికి కృషిచేసిన పూలే దంపతుల చరిత్రను పాఠ్య పుస్తకాల్లో పొందుర్చాలని రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మాలీ సంఘం ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు పెట్కులె సుకుమార్‌తో కలిసి హాజరయ్యారు. మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో మాలీ సంఘం భవనం నుంచి సబ్‌స్టేషన్ సమీపంలోని పూలే దంపతుల విగ్రహాల వరకు ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఆదె అశోక్ మాలీ సంఘం జెండాను ఎగుర వేశారు. మాలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుర్నులే మెంగాజి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొత్రె గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు సెండె బాబురావు ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని పెట్రోల్‌పంపు పాఠశాల, మండలంలోని రాస్పెల్లి పాఠశాలతో పాటు తదితర పాఠశాలల్లో జయంతి వేడుకలను నిర్వహించారు. రాస్పెల్లి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎటుకూరి శ్రీనివాస్‌రావు మాట్లాడారు. పెట్రోల్‌పంపు పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వెంకట్రాజం, బీఎస్పీ నాయకులు జాడి శ్యాంరావు, అవుల రాజ్‌కుమార్, అమ్మశ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..
విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కోసినిలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. ఇందులో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు జయదేవ అబ్రహం, శివప్రసాద్, మూర్తి, నర్సయ్య, సుభాష్, తాజుద్దీన్, పురుషోత్తం, అనువరుద్దీన్, రామయ్య, సీతారాం పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం...
ఇండియన్ మోక్షిత డాన్స్ అకాడమి ఆధ్వర్యంలో విజేత ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ గ్రాండ్ మాస్టర్ కృష్ణ, డాన్స్ మాస్టర్ సంతోశ్ పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్, బూరెపెల్లి, హేటిగూడ, డబ్బా, బారెగూడ గ్రామాలలో మాలి కులస్తులు విగ్రహాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాలి సంఘం నాయకులు నికోడె బాపురావు, గుర్లె శ్రీనివాస్ ఉన్నారు.


జైనూర్ ప్రభుత్వ కళాశాలలో


కెరమెరి: నివాళులర్పిస్తున్న నాయకులు


రెబ్బెన: గోలేటిలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఆసిఫాబాద్‌అర్బన్: మాల వేస్తున్న నాయకులు


చింతలమానెపల్లి: డబ్బా గ్రామంలో


కాగజ్‌నగర్‌రూరల్: విశ్రాంత ఉద్యోగ సంఘం..


దహెగాం: నివాళులర్పిస్తున్న కేజీబీవీ సిబ్బంది


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌రావు

భీమదేవర జెండాపండగను నిర్వహించాలి

జెండాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన: జిల్లాలోని అన్ని ఆదివాసీ గ్రామాలు, గూడెల్లో ఆదివాసీ కోలావార్ ఆత్మ గౌరవ భీమదేవర జెండా పండగను ఈనెల 8న ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ కోలావార్ సేవా సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి కొడిపె వెంకటేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రం లోని రామాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.తరతరాలుగా వస్తున్న ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ కోలావార్‌ల అభివృద్ధి కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడ రామన్న ఉన్నారు.